పీవీకి భారతరత్న.. గర్వకారణం

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 10 : మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారత రత్న ప్రకటించడం గర్వకారణమని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి అన్నారు. పీవీ బహుముఖ ప్రజ్ఞాశాలి, రాజనీతిజ్ఞుడని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి, కేంద్రమంత్రి, ప్రధాన మంత్రిగా ఇలా ఏ పదవి చేపట్టినా తనదైన ముద్ర వేసుకొని విజయవంతమయ్యారని గుర్తు చేశారు. అంతేకాకుండా ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టి దేశ పురోగతిలో మైలురాయిగా నిలిపారని కీర్తించారు. పార్టీలకు అతీతంగా ఆయన సేవలను గుర్తించినందుకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

పీవీ మెమోరియల్ మ్యూజియం ఏర్పాటు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 10: ఉస్మానియా యూనివర్సిటీ పూర్వ విద్యార్థి, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరుమీద మ్యూజియం ఏర్పాటు చేయాలని ఓయూ జేఏసీ కన్వీనర్ తల్లమల్ల శ్వేత హసేన్ డిమాండ్ చేశారు. ప్రస్తుతం మూతపడిన బీ హాస్టల్ (కృష్ణవేణి హాస్టల్)కు మరమ్మతులు చేయించి, పీవీ మెమోరియల్ మ్యూజియం, రీసర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. 106 ఏళ్ల కోటి మంది ఉన్నత విద్య అభ్యసించారని, వారందరిలో ప్రధాని అయిన ఘనత పీవీకే దక్కిందన్నారు. ఇది ఓయూకు గర్వకారణమని అభిప్రాయపడ్డారు.

వందరోజుల్లో..హామీలు అమలు చేయాలి

- విజయోత్సవ సభలో మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని
- హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు

విజయోత్సవ సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్, ఫిబ్రవరి 10 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వంద రోజుల్లో అమలు చేయాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టి ప్రభుత్వానికి తగిన విధంగా బుద్ధి చెబుతామన్నారు. శనివారం సికింద్రాబాద్‌లోని మహబూబ్ కళాశాల ప్రాంగణంలోని ఎస్వీఐటీ ఆడిటోరియంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షతన సనత్‌నగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌తో పాటు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, పద్మారావు, మాగంటి గోపీనాథ్, ముఠా గోపాల్, కౌశిక్‌రెడ్డి, మహమూద్ అలీతో పాటు పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ తలసాని సాయికిరణ్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కేవలం అధికారంలోకి రావాలనే ఆలోచనతో సాధ్యంకాని హామీలను ప్రకటించారన్నారు. వారు ఇచ్చిన హామీలను అమలు చేయాలంటే జీవితకాలం కూడా సరిపోదని విమర్శించారు. హామీలను అమలు చేయకపోతే వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచామన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం - సనత్‌నగర్ఎమ్మెల్యే తలసాని

తన గెలుపు కోసం కృషి చేసిన సనత్‌నగర్ నియోజకవర్గం ప్రజలకు ఏ అవసరమొచ్చినా తాను అండగా ఉంటానని తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రజలు, కార్యకర్తలకు హామీ ఇచ్చారు. సనత్‌నగర్ నియోజకవర్గం విజయోత్సవ సభలో ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మహేశ్వరి, హేమలత, లక్ష్మీబాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్‌లు ఆకుల రూప, తరుణి, శేషుకుమారి, కిరణ్మయికిశోర్, మల్లికార్జున్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సనత్‌నగర్ నియోజకవర్గం విజయోత్సవ సభలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

'గృహజ్యోతి'పై ఇంటింటా ప్రచారం

200 యూనిట్ల ఉచిత విద్యుత్‌పై ఆటోల ద్వారా అవగాహన కల్పిస్తున్న అధికారులు

సికింద్రాబాద్, ఫిబ్రవరి 10: గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులు పేర్కొన్నారు. శనివారం సీతాఫల్‌మండి లైన్‌మెన్ హరికృష్ణ ఆధ్వర్యంలో ఆటోలో మైక్ ద్వారా ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఐదు రోజులుగా సీతాఫల్‌మండి విద్యుత్ కార్యాలయ అధికారి ఏఈ శ్రీకాంత్ రెడ్డి ఆదేశాలతో ఆటోలలో ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. అర్హులైన లబ్ధిదారులకు 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. తెల్లరేషన్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆదివారం కూడా విద్యుత్ అధికారులు వివరాలు సేకరించనున్నట్లు లైన్ మెన్ హరికృష్ణ చెప్పారు.

కొనసాగుతున్న గృహజ్యోతి సర్వే

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్న ప్రజలందరూ దానికి సంబంధించిన ధృవీకరణ పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని మారేడ్‌పల్లి ఎల్క్ట్రికల్ ఏఈ శ్రీధర్ అన్నారు. శనివారం అడ్డగుట్ట డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గృహజ్యోతి పథకం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ శ్రీధర్ మాట్లాడుతూ... అర్హులైన లబ్ధిదారులు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కరెంట్ బిల్లు వివరాలను తమకు అందజేయాలని ఆయన తెలిపారు.

- అడ్డగుట్ట, ఫిబ్రవరి 10

ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

బొల్లారం,ఫిబ్రవరి 10: కంటోన్మెంట్ ఎనిమిదో వార్డు బొల్లారం కంటోన్మెంట్ పార్కు క్రీడా మైదానంలో ప్లే ఫర్ మల్కాజిగిరి రెండో విడత ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోటీలను శనివారం పల్లవి ఫౌండేషన్ చైర్మన్ మల్కా కొమురయ్య ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలో యువకుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి 'ఖేలో ఇండియా స్ఫూర్తి'తో టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ పోటీల్లో 40 జట్లకు గాను మొత్తం 400 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారని వెల్లడించారు.

బొల్లారం కంటోన్మెంట్ పార్కు క్రీడా మైదానంలో ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోటీలను ప్రారంభిస్తున్న పల్లవి ఫౌండేషన్ చైర్మన్ కొమురయ్య

బాక్సింగ్ పోటీల్లో.. అభినవ్‌కు సిల్వర్ మెడల్

అడ్డగుట్ట, ఫిబ్రవరి 10 : జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో సికింద్రాబాద్ అడ్డగుట్ట ప్రాంతానికి చెందిన అభినవ్ సిల్వర్ మెడల్‌ను సాధించాడు. బెంగళూర్‌లో జరిగిన ఖేలో ఇండియా ఆర్ఈసీ సౌత్రన్ ఓపెన్ టాలెంట్ హంట్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో సికింద్రాబాద్ బోల్టన్ స్కూల్‌లో విద్యను అభ్యసిస్తున్న 12 ఏండ్ల అభినవ్ పాల్గొని సత్తా చాటాడు.

హైదరాబాద్ నుంచి అయోధ్యకు పాదయాత్రగా వెళ్లిన ఐదుగురు యువకులను ముదిరాజ్ మహాసభ సీనియర్ సిటిజెన్స్ విభాగం ఆధ్వర్యంలో న్యూబోయిగూడలోని ముదిరాజ్ భవన్‌లో శనివారం సన్మానించారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ సీనియర్లు గోవిందరాములు, సుదర్శన్, సదానంద్, లక్ష్మీనారాయణ, వెంకటేశ్, శ్రీనివాస్, శారద పాల్గొన్నారు. - బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 10

రహదారుల మరమ్మతులు చేపట్టండి

జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించిన డిప్యూటీ సీఎం



డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసిన జెక్‌కాలనీ ప్రతినిధులు

అమీర్‌పేట్, ఫిబ్రవరి 10 : సనత్‌నగర్ జెక్‌కాలనీలో పాడైన రహదారుల నిర్మాణం తక్షణమే చేపట్టాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క జీహెచ్ఎంసీ కమిషనర్‌ను ఆదేశించారు. జెక్‌కాలనీలోని రోడ్డు నంబర్ 3, 4లతో పాటు సెంట్రల్ రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో మరమ్మతుల కోసం గత ప్రభుత్వంలోనే స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ రూ. 86 లక్షలు మంజూరు చేశారు. ఆ వెంటనే ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. ఎనికలు పూర్తయిన తరువాత పనులు చేపట్టడంలో జీహెచ్ఎంసీ అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తుండటంతో జెక్‌కాలనీ నివాసితుల సమాఖ్య అధ్యక్షులు డాక్టర్ మల్లు ప్రసాద్ నేతృత్వంలో ప్రధాన కార్యదర్శి దేవభక్తుని రాజశేఖరచందు, ప్రతినిధులు సచివాలయంలో భట్టిని కలిసి సమస్యను వివరించారు. స్పందించిన డిప్యూటీ సీఎం వెంటనే రహదారుల నిర్మాణాలను చేపట్టాలంటూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశించారు. వారం రోజుల్లో కాలనీలోని 3, 4లతో పాటు సెంట్రల్ రోడ్ల నిర్మాణాలు చేపడుతామని డిప్యూటీ ఈఈ యతీంద్ర మోహన్ తెలిపారు.

ప్రమోషన్లలో ఎస్టీలకు రిజర్వేషన్లు అమలు చేయాలి

ప్రభుత్వ ఉద్యోగులైన ఎస్టీలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు సజావుగా అమలు చేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ వైస్ చైర్మన్ అనంతనాయక్‌కు డాక్టర్ ఆనంద్ విజ్ఞప్తి చేశారు. శనివారం ఢిల్లీలో కమిషన్ వైస్ చైర్మన్‌ను బంజారా మహిళా సొసైటీ వ్యవస్థాపకుడు డాక్టర్ ఆనంద్ కలిసి గిరిజన ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై విన్నవించారు. గిరిజనులపై జరుగుతున్న దాడులను అరికట్టే విధంగా సరైన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు.

సనత్‌నగర్ నియోజకవర్గ ఓటర్ జాబితా విడుదల

- నవంబర్‌లో 2,44,946 మంది
- ప్రస్తుత ఓటర్ల సంఖ్య 2,52,530

బేగంపేట్, ఫిబ్రవరి 10: లోక్‌సభ ఎన్నికలు సమీస్తున్న తరుణంలో సనత్‌నగర్ నియోజకవర్గం ఓటర్ల తుది జాబితాను బేగంపేట్ సర్కిల్ అధికారులు విడుదల చేశారు. నియోజకవర్గంలో 2,52,530 ఓటర్లు నమోదు అయ్యారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో గత నవంబర్‌లో తుది జాబితా విడుదల చేయగా అప్పుడు నియోజకవర్గంలో 2,44,946 మంది ఓటర్లు నమోదై ఉన్నారు. అయితే నాలుగు నెలల్లో 7,584 మంది ఓటర్ల సంఖ్య పెరిగింది. ఇటీవల చేపట్టిన ఓటరు నమోదు శిబిరాలు, ఇంటింటా ప్రచారం, ఆన్‌లైన్ నమోదు ఇవన్నీ కూడాసత్ఫలితాలను ఇచ్చాయని అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం పురుషుల ఓటర్ల కంటే మహిళల ఓట్లే అధికంగా ఉన్నాయి. గత నవంబర్‌లో మగవారి ఓట్లు 1,27,436 ఉండగా,ప్రస్తుతం 1,30,853కి చేరింది. అలాగే మహిళలవి 11,75,02 ఉండగా ప్రస్తుతం వారి సంఖ్య 12,16,67 కు చేరింది. పురుషుల సంఖ్య 3,417కు చేరగా..మహిళలవి 4,165కు పెరిగాయి. వీటితో పాటు 10 మంది థర్డ్ జెండర్ ఓట్లు నమోదయ్యాయి. ప్రతిఒక్కరూ ఓటు హక్కుని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అంతేకాకుండా ఈ సారి ఓటరు నమోదు కార్యక్రమంలో కొత్తగా 7,584 మంది కొత్తగా ఓటు హక్కు కోసం నమోదు చేసుకున్నట్లు బేగంపేట్ సర్కిల్ ఉప కమిషనర్ శంకరయ్య పేర్కొన్నారు.

మెరుగైన సమాజాన్ని నిర్మిద్దాం

ఉమ్మడి ఏపీ హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ చల్లా కోదండరామ్

జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వక్తలు

అమీర్‌పేట్, ఫిబ్రవరి 10 : ప్రజలు జీఎస్టీని పాటించి మెరుగైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఉమ్మడి ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి చల్లా కోదండరామ్ పిలుపునిచ్చారు. తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో శనివారం అమీర్‌పేట్‌లోని ఓ హోటల్‌లో 'జీఎస్టీ.. గ్లోబలైజేషన్ కాన్క్లేవ్' జరిగింది. ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షులు మీలా జయదేవ్ అధ్యక్షతన జరిగిన ఈ కాన్క్లేవ్‌లో ట్యాక్స్ ప్రాక్టిషనర్లు, కన్సల్టెంట్లు, ఐటీ, జీఎస్టీ ప్రభుత్వ అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. జీఎస్టీ రిజిస్ట్రేషన్ కోసం థ్రెషోల్డ్ పరిమితిని చాలా రాష్ట్రాల్లో అమల్లో ఉన్నట్టుగా రూ. 40 లక్షల వార్షిక టర్నోవర్‌కు పెంచాలని ఎఫ్‌టీసీసీఐ చేసిన తీర్మానాన్ని తెలంగాణ ప్రభుత్వం పరిశీలించి అమల్లోకి తేగలిగితే అది రాష్ట్రానికి మేలు చేస్తుందన్నారు. సీఎస్‌టీ, జీఎస్‌టీ రిటైర్డ్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మండలిక శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశంలో ఉత్తమమైన జీఎస్‌టీ విధానం అమల్లో ఉందని, ఈ విషయంలో అనేక దేశాలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయన్నారు. మలేషియా దీనిపై వెనక్కి తగ్గిందని, ఇంతటి వైవిధ్యం ఉన్నప్పటికీ భారతదేశంలో జీఎస్‌టీ భారీ విజయం సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టీసీసీఐ జీఎస్టీ, కస్టమ్స్ కమిటీ చైర్మన్ ఇర్షాద్ అహ్మద్, ఎఫ్‌టీసీసీఐ ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్ సింఘాల్, రవికుమార్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగి మృతి

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 10: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ రైల్వే రిటైర్డు విశ్రాంత ఉద్యోగి రైలు పట్టాలు దాటే సమయంలో రైలు ఢీ కొట్టడంతో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ రైల్వే కాలనీ ప్రాంతానికి చెందిన తాళ్లపల్లి రాజయ్య శనివారం ఉదయం ఇంటి నుంచి చాయ్ తాగడానికి హోటల్‌కు వెళ్లే సమయంలో ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ వద్ద రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో రెండు కాళ్లు విరిగిపోయి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రాజయ్యను 108 అంబులెన్స్ ద్వారా సోమాజిగూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

పీవీ భారతరత్నపై హర్షం

రవీంద్రభారతి, ఫిబ్రవరి 10: మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించడం హర్షణీయమని అంతర్జాతీయ కవి, ఆంగ్ల అనువాదకుడు డాక్టర్ మంతెన దామోదరాచారి అన్నారు. శనివారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేస్తూ పీవీ నరసింహారావు వరంగల్ జిల్లా ఎలువర్తి హవేలిలో నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడిగా 1977లో తమ గ్రామానికి వచ్చినప్పుడు సర్పంచ్ నాయికోటి శంకర్‌రావు పీవీని తనకు పరిచయం చేశారని తెలిపారు.

ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్లక్ష్యం చేయొద్దు



మంత్రి దామోదర్ రాజనర్సింహను సన్మానిస్తున్న ఓయూ ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు, ఓయూ అధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 10: ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో కళాశాల పూర్వ విద్యార్థి, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ యూనివర్సిటీలు, సంస్థలను నిర్లక్ష్యం చేయకూడదన్నారు.యూనివర్సిటీలకు ప్రభుత్వ నిధులు, నియామకాలతో పాటు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద నిధులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సీఎస్ఆర్ నిధుల కోసం కార్పొరేట్ సంస్థలకు లేఖలు పంపాలని, దానికోసం సమగ్ర డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఉస్మానియా యూనివర్సిటీని రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. అందరూ బాగుండాలి అందులో నేనుండాలి అనే భావనతో ముందుకు సాగాలని కోరారు. తాను ఈ స్థాయిలో ఉండేందుకు ఓయూ ఇంజినీరింగ్ కళాశాలే కారణమన్నారు.ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ దేవరకొండ విజయ్‌కుమార్, కార్యదర్శి డాక్టర్ వెంకటరామయ్య, తెలంగాణ ఆల్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్, ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్, ఉస్మానియా గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

'ఆల్ ఇండియా స్టూడెంట్ కాన్ఫరెన్స్‌ను జయప్రదం చేయండి'

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 10: ఈ నెల 25, 26 తేదీల్లో జరుగనున్న ఆల్ ఇండియా స్టూడెంట్ కాన్ఫరెన్స్‌ను జయప్రదం చేయాలని భారత్ బచావో జాతీయ ఉపాధ్యక్షుడు, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్ పిలుపునిచ్చారు. కాన్ఫరెన్స్‌కు సన్నాహకంగా ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గోపీనాథ్ మాట్లాడుతూ భారత్ బచావో తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ కాన్ఫరెన్స్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ యూనివర్సిటీలకు సరైన నిధులు ఇవ్వకుండా, సరిపడా ఫ్యాకల్టీని నియమించకుండా విద్యార్థులపై ఫీజుల భారాన్ని మోపుతోందని ఆరోపించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింత గణేశ్ మాట్లాడుతూ వర్సిటీలలో సరిపడా వసతులు కల్పించి, విద్యలో నాణ్యతను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ఆజాద్, మహేశ్, శ్రవణ్, గణేశ్, సనత్ జయసూర్య, సూర్యుడు, సత్య, రవినాయక్, శ్రీను, హనుమంతునాయక్, సైదులు పాల్గొన్నారు.

సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు, విద్యార్థి నాయకులు

అడ్డగుట్ట, ఫిబ్రవరి 10 : పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎమ్‌వీ ఫౌండేషన్ ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం అడ్డగుట్టలోని బాబూ జగ్జీవన్ రాం భవనంలో మద్యం - మాదకద్రవ్యాల నియంత్రణ కమిటీ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ.. పిల్లలు చిన్నతనం నుంచే ఏదో రకంగా మద్యం,మాదకద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు పిల్లలపై నిఘా ఉంచాలని వారు సూచించారు. పాఠశాలలు, కళాశాలల చుట్టు ప్రదేశంలో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ అడ్వజర్ అజయ్‌బాబు, సీఆర్‌పీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, రమాదేవి, మదర్స్ కమిటీ రామలీల, ఆర్.మల్లేష్, సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి శ్రీనివాస్, ఎమ్.వి. ఫౌండేషన్ ఆర్గనైజర్స్ ఎ.సువర్ణ, భాగ్య, సుమలత, సౌజన్య, లావణ్యతో పాటు పాల్గొన్నారు.

పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

సే నో టూ డ్రగ్స్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్‌వీ ఫౌండేషన్ ప్రతినిధులు

దళితుల అభ్యున్నతికి పాటుపడిన రాజెల్లయ్య సేవలు చిరస్మరణీయమని వక్తలు అన్నారు. శనివారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కొండూరు రాజెల్లయ్య మాదిగ జయంతి సందర్భంగా ఆయన కుమార్తె జీస్పందన ఆధ్వర్యంలో బండమైసమ్మ నగర్ బస్తీలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్డీఎంఏ మాజీ చైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

- బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 10

రాజెల్లయ్య సేవలు చిరస్మరణీయం